# భర్త కాటుకి కుక్క దెబ్బ

— యాళ్ళ అచ్యుత రామయ్య



అనంత్ వీధి గుమ్మం ముందున్న బండలపై నిలబడి బ్రష్ చేసుకుంటున్నాడు. జరజరమన్న శబ్దం విని అనుమానంగా వెనక్కి తిరిగి చూసాడు. బారెడు పొడవున్న పాము ఇంట్లో నుండి వేగంగా ప్రాకుతూ బయటికి వస్తోంది. భయంతో అతను బిగుసుకుపోయాడు.

"వనజా! ఎక్కడ చచ్చావే! పా.. పాము!!" అని అరిచాడు. భయంతో అతని ముఖం జేవురించింది.

అంతలో పాము ప్రాక్కుంటూ కాంపౌండ్ వాల్ దాటి పక్కనే వున్న మునిసిపాలిటీ చెత్త కుండీలో దూకింది.

"అబ్బా... ఏమిటండీ ఆ అరుపులూ? ఓ ప్రక్క నాకు ఆఫీసుకు టైం అయిపోతుంటే మధ్యలో మీ హడావుడేమిటి?" అంటూ వనజ బయటకు వచ్చింది.

భయమూ, కోపమూ కలగలసి పోవడంతో అతని చూపులు వికృతంగా మారాయి. "పిచ్చిదానా, నేను చెప్పబోయే సంగతి విన్నావంటే – భయంతో నీవు స్పృహ తప్పిపోతావ్! మన బెడ్‌రూంలో నుండి ఇప్పుడే ఓ పెద్ద పాము బయటకు పరుగు తీసింది" ఉద్వేగంతో అతని మాటలు తడబడుతున్నాయి.

"అంతే కదా! ఇంతకు ముందెప్పుడూ చూళ్ళేదా? రాత్రివూట రోజూ ఇంట్లోకి రావడమూ, ఉదయాన్నే బయటికి పోవడమూ దానికి మామూలే కదా!" అంది వనజ ప్రశాంతంగా.

ఆ మాటలకు మరింత షాక్ తిని వెంటనే తేరుకుని "ఆ.. నువ్వసలు ఆడ మనిషివేనా? లేక ఆడదెయ్యానివా? ఇంత వరకూ నాకెందుకు చెప్పలేదూ? అమ్మో.. రోజూ రాత్రిళ్ళు పాముతో సహజీవనం చేస్తున్నామా? మళ్ళీ అది బయటకు వస్తుందో, ఏమో?" అని విరుచుకు పడ్డాడు.

ఆమె నుండి సమాధానం రాకపోయేసరికి వాదించి లాభం లేదనుకున్నాడో ఏమో భయం భయంగా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి పాంటు వేసుకుని వచ్చి "వనజా! మా ఫ్రెండ్ వెంకట్ రూమ్‌కు పోతున్నా. పక్కింటి బాబాయిగారికి చెబితే ఎవరైనా పాములు పట్టేవాణ్ణి తీసుకొస్తాడు" అంటూ బయటకు నడిచాడు.

భర్త ఇలా బాధ్యతలు పట్టకుండా తిరిగే మనిషి కాబట్టే పెళ్ళయి నాలుగేళ్ళయినా పిల్లలను కనడానికి ఆమె ఒప్పుకోలేదు. ఇంతకు ముందెప్పుడూ మూడు, నాలుగు చోట్ల ఉద్యోగాలుచేసి మధ్యలోనే మానేసాడు. అదేమంటే వ్యక్తిత్వాన్ని చంపుకుని ఒకరి చేతి క్రింద పనిచేసే తత్వం తనది కాదంటాడు. అసలు సంగతి ఏమిటంటే అతనికి మనుష్యులతో మాట్లాడడం చేతకాదు. తర్వాత్తర్వాత సోమరిపోతు జీవితానికి అలవాటు పడిపోయి ఉద్యోగ ప్రయత్నాలే మానేసాడు. భార్య సంపాదన మీద బ్రతకడానికా మనిషికి సిగ్గే లేదు! లేకపోగా ఇంట్లో ఏ చిన్న ఇబ్బంది ఎదురైనా, వెంటనే తనని టెంపరరీగా వదిలి పెట్టేసి ఫ్రెండు రూమ్‌కి పోయి వారం, పది రోజులపాటు తాగి తందనాలాడి వస్తుంటాడు.

ఇటువంటి జులాయితో కలసి వుండడంలో అర్థం లేదనీ, అతన్ని వదిలి పెట్టి పోవాలనీ ఎన్నోసార్లు ఆలోచించింది. కాని, ఆమె స్నేహితురాలు మాత్రం భర్త ఎంత వెధవైనా వాడి వల్ల భార్యకు కొంత రక్షణ వుంటుంది అని వాదించి తనని భయపె

ట్టేసింది. ఇంట్లోకి పాము వచ్చిందని బయటకు పరిగెత్తే వాడు భార్యకు రక్షణ ఇస్తాడా?

"భర్తల నుండి విడిపోయిన స్త్రీలకు ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా వారికి రక్షణ కల్పిస్తాం అని కానీ ప్రభుత్వం ప్రకటించిందా? ఇప్పుడు మనం చూస్తున్న ఈ కుటుంబ వ్యవస్థ – కొన్ని వేల సంవత్సరాల నుండీ ఉనికిలో వుంటూ వస్తోందని చెప్పబడుతున్న ఈ అవస్త తెల్లవారేసరికి ఆనవాలుక్కూడా మిగలకుండా మాయమైపోతుంది. ఒకప్పుడు కుటుంబం అనేది ఇలా వుండేది సుమా అని మ్యూజియంలో మోడల్‌గా చూపించుకోడానిక్కూడా ఏమీ మిగలదేమో!

ఆమె పల్లెలో పుట్టి పెరిగింది కాబట్టి రోజూ తమ ఇంట్లోకి వచ్చే పాము – జెర్రిగొడ్డనీ, విషపు పాము కాదనీ తెలుసు. అయినా పామంటేనే సహజంగా ఒళ్ళు జలదరించాలి. కానీ.. గొడ్డుతో కాపురం చేస్తున్నదానికి జెర్రి గొడ్డును చూస్తే భయం కానీ, అసహ్యం కానీ ఎలా వుడతాయి?

ఏ రోజైనా తనని సుఖపెట్టాడా? ఎంత దుర్మార్గుడు కాకపోతే శోభనం రాత్రి అతని కుళ్ళు డైరీ తీసి ఏయే అమ్మాయిలతో ఎలా కులికాడో.. ఆ దరిద్రం రాత్రులన్నీ తనని పైకి చదవమంటాడూ! అంతవరకు ప్రతి రాత్రీ వసంత రాత్రి అంటూ కలలు కన్న తనకు ప్రతి రాత్రీ అత్యాచారపు రాత్రి అయిపోయింది కదా! అతని రాక్షస రతిలో ఆమె శరీరాన్నీ, మనసునూ ముక్కిరి చేసి వదిలాడు.

ఎప్పటికైనా అతనిలో మార్పు రాకుండా పోతుందా అన్న ఎదురు చూపు – ఆమెకు నిరాశే మిగిల్చింది. ఆఖరికి అమ్మాయిల్ని ఇంటికే తెచ్చుకుని తన కళ్ళ ముందే అనుభవించే స్థాయికి దిగజారాడు. కాఫీలో ఇంత విషమిచ్చి అతని పీడను శాశ్వతంగా వదిలించుకోవాలన్న కోరికను ఎంతో బలవంతంగా ఆపుకుంది.

మొన్నటికి మొన్న ఆమె తన ఊరి నుండి పని పిల్లను తెచ్చుకుంటే తనిలా ఆఫీసుకు బయల్దేరగానే – పన్నెండేళ్ళ ఆ పని పిల్లతో వెకిలిగా ప్రవర్తించడం – అతని అఘాయిత్యాలకు పరాకాష్ఠ! మర్నాడు ఆ పిల్ల ఊరెళ్ళిపోతానని ఎందుకు పట్టు పట్టిందో ఆమెకు వెంటనే అర్థం కాలేదు. నెమ్మదిగా అసలు విషయాన్ని ఆ పిల్ల నుండి రాబట్టాక – వెంటనే దానిని ఊరికి పంపించి వేయగలిగిందే కానీ – అతనికి విడాకులిచ్చేసే ధైర్యం చేయలేకపోయింది.

చిన్నప్పుడే ఆమె తల్లిదండ్రులు చనిపోవడమూ, వున్న ఒక్క అన్నా అతను పని చేస్తున్న కంపెనీ మూత పడ్డంతో దుబాయ్‌కి పోవడం వల్ల ఆమెకు నా అన్న వాళ్ళెవరూ లేకుండా పోయారు.

చిన్నప్పటి నుండీ ఒంటరిగా వుండాలంటే ఆమెకు చచ్చేంత భయం. ఒక్కతీ ట్రెయిన్‌లో ప్రయాణం కూడా చేయలేదు. పెళ్ళయ్యాక ఆమెలోని భయమూ, ఒంటరితనమూ మరింతగా పెరిగాయి.

పెళ్ళయిన కొత్తలో జరిగిన సంఘటన ఆమెకి ఎప్పుడూ గుర్తుకొస్తూ వుంటుంది. భర్త బలవంతంగా – కొత్తగా రిలీజైన పిక్చరుకు తీసికెళ్ళాడు. వెనక లైన్లో కూర్చున్న కుర్రాళ్ళు తనపై అసభ్యంగా కామెంట్ చేస్తున్నారు. వాళ్ళ మాటలు వినలేక చెవిన పడకుండా వుండడానికి భర్త ఏదో అనవసర విషయాలు తనతో మాట్లాడతాడే తప్ప వాళ్ళను ఏమీ అనలేదు. తనే భరించలేక వెనక్కి తిరిగి "షటప్" అని గట్టిగా అరిచింది. తర్వాత ఎంత గొడవ జరుగుతుందో అని భయపడింది. కాని, వాళ్ళు వెంటనే నోరు మూసేసారు. బయటకు వచ్చాక వాళ్ళేం గొడవ చేస్తారోనని ; సినిమా మధ్యలోనే ఇంటికి తీసుకుని వచ్చేసాడు. అంతటితో ఊరుకోక – ఇంటికొచ్చాక వాళ్ళేమైనా నీ పేరు పెట్టి కామెంట్ చేసారా? నువ్వెందుకలా అనవసరంగా నోరు పారేసుకున్నావ్! అని తనపై విరుచుకు పడ్డాడు. నోరు పారేసుకున్నది వాళ్ళా, తనా? దాంతో అతనిపై కోపం రాకపోగా బోల్డంత జాలి కలిగింది. మగవాళ్ళెంత పిరికి వాళ్ళో ఆమెకప్పుడు బాగా అర్థమైంది.

ఈ మధ్యనే ఆఫీసులో బాగా ఆలస్యం కావడంతో తను హడావుడిగా నడుచుకుంటూ వస్తుంటే ఓ పోకిరీ వెధవ వెంటబడి ఆంటీ అంటూ ఎంతో అసహ్యంగా ప్రవర్తించాడు. భయంతో గుండె ఏ క్షణాన్నయినా ఆగిపోతుందేమో అనిపించింది. అదృష్టం బావుండి ఆ సమయంలో తెలుసున్నాయన స్కూటరుపై అటుగా పోతుంటే లిఫ్ట్ అడిగి వచ్చేసింది. లేకపోతే ఏం జరిగేదో ఇంటికొచ్చాక భర్తతో జరిగిన సంగతంతా చెప్తే తను ఏడిస్తే రోడ్డు మీద ఎంతో మంది ఆడాళ్ళుపోతుంటే వాడు నిన్నొక్కదాన్నే ఎందుకన్నాడు' అని తన అల్పత్వాన్ని ప్రదర్శించుకున్నాడు. ఆ కుర్రాడికంటే భర్త చేసిన అవమానం ఆమెను బాగా గాయపరిచింది.

ఇలాంటి సంఘటనలనేకం జరగడంతో ఆమె నమ్మకాల పునాదిలో అనేక పగుళ్ళు ఏర్పడ్డాయి. పెళ్ళయిందీ, భర్తతో వుంటోందీ. ఈమెను గౌరవించాలి అని బయట ఎవరూ అనుకోవడం లేదు. తనకేమైనా జరిగినా భర్త ఏమీ రక్షించలేడని అనేకసార్లు ఋజువైంది. ఈ జీవన ప్రవాహంలో చిన్న పూచిక పుల్ల ఆధారం దొరికినా చాలు – ఈ భర్తనే భల్లూకం నుండి ఆమె పట్టు విడిపించుకునేదే! గడియారం తొమ్మిది గంటలు కొట్టడంతో ఆమె అంతరంగం మీద గేట్లు మూసేసింది.

గబగబా టిఫిన్ బాక్సు సర్దుకుని ఆఫీసుకు బయల్దేరింది. ఎంత స్పీడుగా నడిచినా మెయిన్ రోడ్డు మీదికి వెళ్ళేసరికే ఇరవై అయిదు నిమిషాలు పట్టింది. అంతలో పక్కింటి వాళ్ళమ్మాయి సుష్మ కుక్కను నడిపించుకుంటూ బస్టాపు మీదుగా వెడుతోంది. ఇంటరు కాబోలు చదువుతోంది. ట్యూషన్‌కి రోజూ ఇక్కడికే వస్తుంది. ఆ అమ్మాయి చాలా నాజూగ్గా, అందంగా వుంటుంది. ఆమె మొహంలో ధైర్యం, ప్రశాంతతా ప్రతిబింబిస్తోంది. కుక్క తోడుగా వుంది కాబట్టి కానీ లేకపోతే వాళ్ళ నాన్నగారినో అన్ననో కూడా తీసుకు వచ్చేదే! వెంటనే వనజకి ఆ అమ్మాయి కంటే అక్కడున్న మగాళ్ళ మొహాల్లోకి చూడాలనిపించింది.

ఓ రోడ్డు రోమియోగాడు ఆ అమ్మాయికేసి ఆబగా చూసాడు. అతడి చూపులు – ఆ అమ్మాయి మొహం మీద కొద్ది క్షణాలు ఆగి వెంటనే క్రిందికి జారి అక్కడ ఎక్కువ సేపు ఆగి మళ్ళీ క్రిందికి ప్రవహించాయి. ఒకడుగు ముందుకు వేసాడు. ఆమె నాజూకైన చేతుల్లో స్టీలు చెయిన్ చూడగానే వాడి మొహంలో కొంత బెదురు కనిపించింది. ఆ చెయిన్ చివర నాలుగడుగులు ఎత్తున్న ఆల్సేషన్ కుక్క – నాలుక చాపుకుని కలకత్తా కాళి కంటే భయంకరంగా వుంది. వెంటనే వాడి రక్తం చల్లబడడంతో రెండడుగులు వెనక్కి వేసాడు. అక్కడున్న చాలా మంది మగవాళ్ళ పరిస్థితి అలానే వుంది. ఆ అమ్మాయి హాయిగా ముందుకు కదిలిపోతూ వుంది.

వెంటనే వనజకి ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. పరుగున వెళ్ళి "సుష్మా" అంటూ ఆప్యాయంగా పిలిచింది.



ఆ అమ్మాయి వెనక్కి తిరిగి "ఓహ్... మీరా ఆంటీ!" అని నవ్వుతూ, పొడవుగా వ్రేలాడుతున్న చెయిన్ని చాలా వరకూ ఎడమ అరచేతికి చుట్టుకోవడంతో కుక్క ఆ అమ్మాయి దగ్గరగా వచ్చింది.

"చెప్పండి...ఆంటీ?" అంది సుష్మ.

"చిన్న ఇన్ఫర్మేషన్ కావాలమ్మా! నాక్కూడా ఇలాంలంటి కుక్కనొక దాన్ని కొనుక్కోవాలని వుంది. ఎక్కడ దొరుకుతుందీ, ఎంత ఖరీదుంటుందీ... ఈ వివరాలు కావాలి" అంది.

ఆ అమ్మాయి చెప్పిన వివరాలను నోట్ చేసుకని "థాంక్యూ" అని వనజ ముందుకు కదిలింది. తన సమస్యకు పరిష్కారం తాత్కాలికమైనదే కావచ్చు. దొరికిందనిపించింది.

** ** **

ఆల్సేషన్ కుక్కని ఇంటికి తీసుకొచ్చుకుని వారం రోజులు తిరగక ముందే అది వనజకెంతో దగ్గరైపోయింది. దాని గురించి ఎవరికైనా చెప్పాల్సి వచ్చినప్పుడు కుక్క అని సంబోధించడం ఆమెకి బాధగా వుంటోంది. అందుకే దానికి రాణి అని పేరు పెట్టుకుంది. బస్సుల్లో గబ్బిలాల్లా వ్రేలాడ్డం ఇష్టం లేక ఆఫీసుకు నాలుగు కిలమీటర్లు దూరంలో వున్న ఆమె రోజూ నడిచి వెళ్ళి నడిచి వస్తూ వుంది. రాణిని రోజూ ఆఫీసుకు తన వెంట తీసుకొని వెళ్ళి స్కూటర్ స్టాండు వాడికి రోజుకు రూపాయిచ్చి అక్కడున్న స్తంభానికి కట్టి వేస్తోంది.

వనజ వంటింట్లో వున్నా, హోటల్లో వున్నా రాణి ఆమె వెనకెనకే తిరుగుతూ వుంటోంది. పెళ్ళయిన కొత్తలో కూడా అనంత్ తన చుట్టూ ఇలా తిరగలేదు.

ఆమె పెట్టిన భోజనాన్ని రాణి ఎంతో తృప్తిగా తింటుంది. భర్తలా అన్నిటికీ పేర్లు పెట్టదు. ఎంత అర్ధరాత్రయినా సరే చీమ చిటుక్కుమంటే చాలు "భౌ..భౌ" మన ఇంటి చుట్టూ పహారా కాస్తుంది. ఆ అరుపులు వింటూంటే ఆమెకు చక్కని సంగీతం విన్నంత హాయిగా వుంటుంది. రాణి ఇంట్లో అడుగు పెట్టినప్పటి నుండీ పాము ఇంట్లోకి రావడం మానేసింది.

గేటు చప్పుడు కావడంతో వనజ బయటకు వచ్చింది. మాసిన గెడ్డం, నలిగిపోయిన బట్టలతో అనంత్ ఎదురుగా నిలబడ్డాడు. ఆమె వెనకనే రాణి తోక ఊపుకుంటూ రావడంతో అతను కంగారుగా రెండడుగులు వెనక్కి వేసి "ఎవరిదీ కుక్క? తొందరగా పంపించేయ్. నాకు కుక్కంటే ఎలర్జీ అని తెలుసుకదా?" అని పూనకం వచ్చిన వాడిలా ఊగిపోయాడు.

"తోడుగా వుంటుంది కదాని నేనే దీన్ని తెచ్చుకున్నాను. ఇక నుండీ ఇదీ నాతోనే వుంటుంది" అంది వనజ. ఆమె మాటల్లో గొప్ప ధీమా ధ్వనిస్తోంది.

"ఎవరీ ఆగంతకుడు?" అన్నట్టుగా రాణి – అనంత్ వైపు అనుమానంగానూ, అసహనంగానూ చూస్తోంది.

శారీరకంగానే కాక మానసికంగా ఖూడా భార్యను ఎలా హింసించాలో భర్తల కాలేజీలో నేర్చుకున్నవాడు కాబట్టి "ఇంతకీ ఈ కుక్క మగదా, ఆడదా?" అన్నాడు వంకరంగా నవ్వుతూ.

ఎంత వెంకటకారం! వనజ రక్తమంతా మరగి పోయింది. అంతకంటే స్ట్రాంగ్‌గా తను రిటార్ట్ ఇవ్వాల్సిందే" ఏం ఆడ కుక్కైతే దీనిపై కూడా అత్యాచారం చేయవచ్చా అనా?" అంది.

: ఊహించని ఈ సమాధానానికి అతను ఖంగుతిన్నాడు. అతనిలోని పురుషాహంకారం విశ్వరూపం ధరించింది. "యూ బిచ్. ఏం కూసావ్?" అంటూ ఆమె జుట్టు పట్టుకుని గుంజాడు.

తనని ఎంతో ప్రేమగా చూసుకుంటున్న వాళ్ళను ఎవరైనా అవమానిస్తే చూస్తూ ఊరుకోడానికి భర్త కాదు – విశ్వాసం వున్న కుక్క అది! అంతే సారించిన వింటి నుండి వెలువడిన బాణంలా రాణి అతనిపైకి ఉరికింది. ముందు కాళ్ళను రెంటినీ అతని భుజంపైవేసి కంఠం అందుకోపోయింది. అతని కళ్ళల్లో చావు భయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. రాణి రెండు కాళ్ళనూ అతను చేతులతో నెట్టేసి ఇంటి వెనక్కి పరిగెత్తి గోడ దూకి పారిపోయాడు.

పెళ్ళయిన ఇన్నాళ్ళకు మొదటిసారిగా వనజ తృప్తిగా ఊపిరి పీల్చుకుంది. పీడా విరగడైపోయింది. అప్పుడే అయిపోయిందా? వాడు మళ్ళీ తిరిగొచ్చినప్పుడు అతని ఉచ్చుల నుండి శాశ్వతంగా బయట పడ్డానికి అవసరమైన వ్యూహం గురించి ఆలోచిస్తోంది. తనకిప్పుడు భయం లేదు. భర్తా, పోలీసులూ. ప్రభుత్వమూ కల్పించని భద్రతను తనకి ఓ కుక్క కల్పించింది.

## ఈ దేశంలో

పాత బస్తీలో
పారా మిలట్రీ దళాలు
చచ్చిన 'లా అండ్ ఆర్డర్'కు
అలంకరణ చేస్తున్నాయి
కర్ఫ్యూ కాలాన్ని పొడిగించి...

కొండ కోనల్లో
ముట్లుడిగిన నక్సలిజానికి
సింద్రోం చికిత్స జరుగుతుంది
విప్లవాన్ని ప్రసవించేందుకు వీలుగా...

పోఖ్రాన్ ఇసుక రేణువులతో
భవి–తవ్యపు బంగ్లా నిర్మించబడుతుంది
ఆకలి కేకలు వేసే శవాల ఎముకలు
ఎ.సి.మిషన్లుగా మార్చుకొని...

నిన్న చచ్చిన ఒక పార్టీ
నేడు రెండుగా పుడుతుంది
రేపు జరాసంధ్రుడిలా కలుస్తుంది
ప్రజాస్వామ్యపు వెన్నుమీద
రాచపుండై మొలుస్తుంది...

ఈ దేశంలో
దళారులతో పాటు, తెల్లని
పత్తి బేళ్ళ మధ్య నల్లని
మృత్యుకోర రైతు కోసం
పొంచి ఉంటుంది...

ఇక్కడ
మందిరమో
మసీదో
చిత్ర లేఖనమో
జీవనాన్ని
ఛిద్రం చేస్తుంది!

—ఆర్.అమర్‌నాధ్.